విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, మంగళవారం 16, సెప్టెంబర్ 2025

ఘనంగా మోక్షగుండం జయంతి వేడుకలు

విశాలాంధ్ర- పాణ్యం: జాతీయ ఇంజనీర్స్ డే సందర్భంగా సోమవారం మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి వేడుకను మండలంలో ఘనంగా నిర్వహించారు. ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ జయచంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించి నివాళులర్పించారు. శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ డాక్టర్ శాంతి రాముడు, డైరెక్టర్ అశోక్ కుమార్, వివిధ విభాగాల హెచ్ఓడీలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆలయం నందు మండల పూజలు

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : మండల కేంద్రంలోని కొండపై వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం నందు సోమవారం భక్తులు గ్రామ పెద్దల ఆధ్వర్యంలో మండల పూజలను నిర్వహించారు. జీర్ణవస్తకు చేరిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంను రాంకో యజమాన్యం సుమారు రూ.7.5 కోట్లతో జీర్ణోద్ధరణ గావించి జులై చివరిలో ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. సోమవారం నాటికి 41 రోజులైన సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. భూదేవి, శ్రీదేవి సమేత శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం నందు స్వామివారికి మండల అర్చనలు, అభిషేకాలు, హెూమాలతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించారు. మండల పూజకు విచ్చేసిన భక్తులకు ప్రజలకు కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం గావించారు.

ఆటోమోటీవ్, ఎలక్ట్రానిక్స్ ల్యాబ్‌ల ప్రారంభం

విశాలాంధ్ర - శిరివెళ్ల : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హై స్కూల్లో ఆటోమోటివ్, ఎలక్ట్రానిక్స్ ల్యాబ్‌లు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ ప్రత్యేక కార్యక్రమా నికి ప్రధాన అతిథులుగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్ గోవిందరాజ, నంద్యాల జిల్లా అధికారిని నాగ సువర్చల ల్యాబ్‌లను ప్రారంభించారు. ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు ప్రాయోగిక జ్ఞానం, సృజ నాత్మకత, నైపుణ్యాభివృద్ధి అందించడానికి ప్రత్యేక సదుపాయాలు కల్పించబడ్డాచని తెలిపారు. జిల్లా అధికారి మాట్లాడుతూ ఈ ల్యాబ్‌లు విద్యార్థుల్లో ఆవిష్కరణ, అభ్యాసం, సాంకేతిక పరిజ్ఞానం పట్ల ఆసక్తిని పెంచడమే కాకుండా భవిష్యత్తు కోసం బలమైన పునాదులు వేస్తాయని తెలుపారు.

పంటలకు నష్టపరిహారం ఇవ్వాలి

విశాలాంధ్ర - ఆత్మకూరు రూరల్ : మండలంలోని దెబ్బతిన్న పంట పొలాలలో ఆత్మకూరు రైతు సేవ సంఘం అధ్యక్షుడు మోమిన్ మునీర్ భాష ఆధ్వర్యంలో పంట పొలాలనూ పరిశీలించారు. ఈ సందర్భంగా కృషి వండ్లతోటల సంఘం అధ్యక్షులు బైరాపురం మహబూబ్ బాషా మాట్లాడుతూ దెబ్బతిన్న పంటలకు మాత్రమే సంబంధిత అధికారులు పరిశీలించి ప్రభుత్వం నుంచి నష్టపరిహారం వచ్చేలా కృషి చేయాలన్నారు. బెజ్జం నవీసా, టైగర్ బాబు, ఎన్.ఎస్ రఫీక్, ముసలముడుగూ రసూల్, రాజమద్ ఇబ్రహీం, ఖాదర్ వలీ, బైరాపురం అక్బరుద్దీన్, మేదరి వెంకటేశ్వర్లు, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: ఎల్ కెఆర్ స్కూల్ నందు విద్యార్థినీలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ అనే అవేర్నెస్ ప్రోగ్రాం ఎల్ కెఆర్ స్కూల్ నందు నిర్వహించారు. ఈ ప్రోగ్రాం నందు మహిళ పోలీసుల ద్వారా ఈ అవేర్నెస్ ప్రోగ్రాం నిర్వహించడం జరిగింది. మన సమాజంలో ప్రతిరోజు మహిళల పట్ల పిల్లల పట్ల జరుగుతున్న అకృత్యాలను కొంతవరకుఅవగాహన కార్యక్రమం ద్వారా నివారించవచ్చని, నేటి సమాజంలో పాఠశాలలో చదివే ప్రతి ఆడపిల్లలకు తెలుసుకోవలసిన అవసరం ఉంది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ కోటి నాగేశ్వరరావు, ఏవో రమణ పాల్గొన్నారు.

విద్యార్థినీల పట్ల దురుసుగా ప్రవర్తిస్తే చర్యలు

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : విద్యార్థినీల పట్ల దురుసుగా ప్రవర్తిస్తే చర్యలు తప్పవని కేజీబీవీ లోని కుక్ అండ్ హెల్పర్స్ ను ఎంఈఓ అబ్దుల్ కలాం హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంలోని కేజీబీవీ ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యాలయంలోని పాల్ ల్యాబ్ ను పరిశీలించి విద్యార్థినిలను పలు ప్రశ్నలు అడిగారు. ల్యాబ్ వల్ల కలిగే ప్రయోజనాలు ఏమిటని అడిగి విద్యార్థుల నుండి సమాధానాలను రాబట్టారు. అనంతరం విద్యాలయం నందు మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థినీలకు కుక్ అండ్ హెల్పర్స్ వడ్డిస్తున్న విధానాన్ని పరిశీలించి వారిని హెచ్చరించారు. విద్యార్థినిలను మీ పిల్లలతో సమానంగా చూసుకోవాలని దురుసుగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని ఎంఈఓ తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - చాగలమర్రి : మండలంలో ఉండే సచివాలయ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలంటూ మండల వ్యాప్తంగా ఉన్న సచివాలయ ఉద్యోగులు సోమవారం ఎంపీడీవో రాజేంద్ర ప్రసాదుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా సచివాలయ ఉద్యోగులు మాట్లాడుతూ నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలన్నారు. 6సంవత్సరాల పాటు ఒకే క్యాడర్లో సర్వీస్ చేసిన వారికి ఏఏఎస్ ప్రకారం స్పెషల్ ఇంక్రిమెంట్ మంజూరు చేయాలన్నారు. గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులకు ప్రస్తుతం అమలు అవుతున్న రికార్డు అసిస్టెంట్ క్యాడర్ స్కేలును జూనియర్ అసిస్టెంట్ క్యాడర్ కు మార్పు చేయాలన్నారు. అన్ని విభాగాల వారిగా ప్రమోషన్ చానల్స్ ఏర్పాటు చేసి జిల్లాల వారిగా సీనియారిటీ జాబితాను విడుదల చేయాలని కోరారు. సచివాలయ ఉద్యోగులు ప్రసన్నకుమార్, నరేంద్ర, సుజాత, మదన్, భార్గవ్, భూపాల్, మహబూబ్ బాష తదితరులు పాల్గొన్నారు.

30 ఏళ్లయినా సౌకర్యాలకు నోచుకోని ప్రజలు

విశాలాంధ్ర - నందికొట్కూరు: నందికొట్కూరు మున్సిపాలిటీ పరిధి లోని మారుతి నగర్ కాలనీ ఏర్పడి దాదాపు 30 సంవత్సరాలు కావస్తున్న అక్కడి ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించడంలో పాలక ప్రభుత్వాలు ప్రజాప్రతినిధులు విఫలమయ్యారని సిపిఎం నంద్యాల జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.నాగేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట కాలనీ వాసులతో కలిసి ధర్నా చేశారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాసులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వాలు మున్సిపాలిటీ పరిధిలోని మారుతి నగర్ లో దాదాపు 3 వేల కుటుంబాలు నివసిస్తున్నప్పటికీ కనీస సౌకర్యాల కు నోచుకోవడం లేదన్నారు. కాలనీవాసులకు తాగేందుకు మంచినీటి వసతి లేక నానా అవస్థలు పడుతున్నారని మారుతి నగర్ లో విద్యుత్ స్తంభాలకు వీధి దీపాలు లేకపోవడంతో కాలనీ వాసులు చీకటిలో మగ్గుతున్నరన్నారు. కాలనీలో ప్రజా పంపిణీ చౌక దుకాణం ఏర్పాటు చేయాలని మరియు ఉర్దూ,తెలుగు మీడియం పాఠశాలలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు టి.గోపాల కృష్ణ, కాలనీవాసులు కమల్ సాహెబ్,షేక్ హుస్సేన్, నబి రసూల్, మహిళలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి : ఏఐటీయూసీ

విశాలాంధ్ర-డోన్ : ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వి.సుంకయ్య అన్నారు. సోమవారం ఏఐటీయూసీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు.. ఆటో కార్మికుల సమస్యలపై పరిష్కరించాలని నిరసన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక పాత బస్టాండ్ లో డోన్ నియోజకవర్గ ఏఐటియుసి ఆటో యూనియన్ అధ్యక్షులు వెంకటేష్ గౌడ్ అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఏఐటియుసి కార్యదర్శి వి.సుంకయ్య, జిల్లా ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు అన్వర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఆటో కార్మికుల సమస్యల పరిష్కరించాలన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం కల్పించడంతో ఆటో కార్మికులకు ఆదాయం లేక ఆటో కార్మికుల కుటుంబానికి పోషించడం చాలా ఇబ్బందిగా గురవుతున్నారన్నారు. తక్షణమే కూటమి ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు జీవన ఉపాధి కింద నెలకు 5000 రూపాయలు చొప్పున సంవత్సరానికి 60 వేల రూపాయలు ఇవ్వాలన్నారు. ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, కాంపౌండ్ ఫీజులు పెంచే జీవో నెంబర్ 21, 31 రద్దు చేయాలన్నారు. ప్రైవేట్ సంస్థలకు ఇచ్చిన ఫిట్నెస్ డ్రైవింగ్ లైసెన్స్ లో అనుమతులు రద్దుచేసి, ప్రభుత్వ ఆధ్వర్యంలో లైసెన్సులు ఫిట్నెస్ చేయాలని పెంచిన డీజిల్, పెట్రోల్ ధరలను తగ్గించాలన్నారు. థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ రోడ్ టాక్స్ లేబర్ టాక్స్ ఫీజులు తగ్గించాలన్నారు. ఆటో డ్రైవర్ల న్యాయమైన కోరికలను పరిష్కరించాలని, లేనియెడల రాబోయే రోజుల్లో నిరసన కార్యక్రమాన్ని తీవ్రత ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు ఖాసీం, నారాయణ, మధు, షేక్ష,బద్రి, రాముడు, కంబగిరి తదితరులు పాల్గొన్నారు.

అమరావతి మాదిరిగా, నంద్యాల మెడికల్ కాలేజీ గ్రాఫిక్స్ కాదు

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: వైసీపీ అధికారంలో మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి రాష్ట్రంలో కొత్తగా 17 మెడికల్ కళాశాలను ఏర్పాటు చేసేందుకు ఆడుగులు వేసి అధికారంలో ఉన్న కాలంలోనే 5 మెడికల్ కళాశాలను సెప్టెంబర్ నెల 15వ తేది 2023 సంవత్సరం అట్టహాసంగా ప్రారంభించి నేటికి సరిగ్గా రెండు సంవత్సరాలు కావస్తున్నదని, దిగ్విజయంగా మూడవ సంవత్సరం మెడికల్ అడ్మిషన్ల ప్రక్రియను ప్రభుత్వం చేపడుతున్నది. ఇది వాస్తవం కాదా, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గ్రాఫిక్స్‌తో అమరావతిని సృష్టించినట్లు మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో ఉన్న 5 మెడికల్ కళాశాలలను గ్రాఫిక్స్ చేయలేదని, ఇందుకు నిలువెత్తు సాక్షాలుగా నంద్యాల మెడికల్ కళాశాల ఉందని ఇది వాస్తవమని నిజాలు చారిత్రక నిర్మాణాలు కూటమి ప్రభుత్వానికి, రాష్ట్ర హెూంమంత్రి వంగలపూడి అనిత కళ్లకు కనిపించలేదా అని నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాష హెూమంత్రి చేసిన అసత్యపు ప్రచారంపై తీవ్రంగా మండిపడ్డారు. వాస్తవాలను, నిజానిజాలను ప్రజలకు కూటమి ప్రభుత్వ నేతలకు తెలియజేసేందుకు సోమవారం నంద్యాల ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రాగణంలో కళాశాల ఎదురుగా మీడియా సమావేశం నిర్వహించి నిజాలను నిగ్గు తెల్చారు. మాజీ రాష్ట్ర మార్క్ఫెడ్ అధ్యక్షుడు పీపీ నాగిరెడ్డి, మున్సిపల్ చైర్పర్సన్ మాబున్నిసా, వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీపీ మధుసూధన్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు దాల్మిల్ అమీర్, జిల్లా ప్రధాన కార్యదర్శి సోమశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జాతీయ ఇంజనీర్ల దినోత్సవం

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: భారతరత్న మోక్ష గుండం విశ్వేశ్వరయ్య జయంతి పురస్కరించు కుని జాతీయ ఇంజనీర్ల దినోత్సవం నంద్యాల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ఈఎస్ ప్రభుత్వ పాలి టెక్నిక్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సోమేసుల నాగరాజు అధ్యక్ష తన జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా మోక్ష గుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. సభా కార్యక్రమంలో పాలి టెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ శైలేంద్ర కుమార్, డాక్టర్ గెలిచి సహదేవుడు, డాక్టర్ రవికృష్ణ అతిథులుగా పాల్గొని మోక్షగుండం విశ్వేశ్వరయ్య జీవిత విశేషాలు వివరించారు. ప్రిన్సిపాల్ శైలేంద్ర కుమార్ మాట్లాడుతూ దేశ నిర్మాణంలో, అభివృద్ధిలో ఇంజనీర్ల పాత్ర విశిష్టమైనదని అన్నారు. డాక్టర్ సహదేవుడు, డాక్టర్ రవికృష్ణ మాట్లాడుతూ వైద్య బయో మెడికల్ ఇంజనీరింగ్‌లో, వ్యవసాయ రంగంలో, సమాచారం విప్లవంలో ఇంజనీర్ల పాత్ర అద్వితీయ మైనదన్నారు. డిస్ట్రిక్ట్ పంచాయతీరాజ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, లయన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్ సుధాకర్ రెడ్డి సౌజన్యంతో ముగ్గురు ఇంజనీరింగ్ అధ్యాప కులకు పురస్కారాలు, కళాశాల విద్యార్థులకు నిర్వహిం చిన వక్తృత్వ పోటీల విజేతలకు బహుమతులు, అందజేశారు. కళాశాల సీనియర్ అధ్యాపకులు సంజీవరాయుడు, విద్యాశ్రీ, సాయినాథ రెడ్డిలను శాలువా, జ్ఞాపికలతో సత్కరించి, లయన్స్ క్లబ్ జాతీయ ఇంజనీర్స్ దినోత్సవ పురస్కారాలను ప్రదానం చేశారు. లయన్స్ క్లబ్ కార్యదర్శి తాతిరెడ్డి భాస్కర రెడ్డి, కోశాధికారి అమిదేల జనార్ధన్, కార్యక్రమ స్పాన్సర్, రీజియన్ చైర్మన్ పీవీ సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

మహిళ మృతిపై సమగ్ర విచారణ జరిపించాలి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: నెరవాటి హాస్పిటల్‌లో మహిళ మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నాగరాముడు డిమాండ్ చేశారు. జినాగరాముడు మాట్లాడుతూ వైద్యం నిర్లక్ష్యం చేసిన డాక్టర్‌పై, నేరవాటి హాస్పిటల్ యాజమాన్యంపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, ప్రైవేట్ హాస్పిటల్‌లో నిండు గర్భిణీ స్త్రీ ప్రాణాలు పోయినప్పటికి ఎలాంటి చర్యలు లేకపోవడం ప్రభుత్వ అధికారులే ఆత్మ విమర్శచేసుకోవాలన్నారు. నెరవాటి హాస్పిటల్‌లో జరిగిన సంఘటన ఏ హాస్పిటల్లో జరగకుండా ఉండే విధంగా నేరవాటి హాస్పిటల్ యాజమాన్యంపై చర్యలు తీసుకొని మృతి చెందిన కుటుంబానికి న్యాయం చేసే విధంగా ఉండాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు మధు, పాములేటి, బాష తదితరులు పాల్గొన్నారు.

నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిసాం

విశాలాంధ్ర -మహానంది: ఈ నెల 22నుండి ప్రారంభమయ్యే నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని ఆలయ కార్యనిర్వాహనాది కారి శ్రీనివాస రెడ్డి తెలిపారు. సోమవారం మహానంది పుణ్యక్షేత్రంలో జరిగే ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ 11రోజుల పాటు జరిగే ఉత్సవాలలో శ్రీకామేశ్వరీ దేవి అమ్మవారిని ప్రత్యేక అలంకరణలతో భక్తులకు దర్శన మెచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. విద్యుత్ అలంకరణలతో భక్తులు ఆనంద పడేలా చూస్తామన్నారు. దసరా పండుగ రోజున ఎన్నడూ లేనివిదంగా అమ్మవారిని శివ కామేశ్వరిగా అలంకరణ చేస్తున్నట్లు తెలిపారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు జరగకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు. అంతకు ముందు కళ్యాణ మండపంలో వేద పండితులు రవిశంకర్ అవధాని, నాగేశ్వర శర్మ, హనుమంతు శర్మ, ప్రధాన అర్చకులు అర్జున్ శర్మ, ఉప ప్రధాన అర్చకులు జనార్ధన్ శర్మ, కొమ్మెద్ది శంకరయ్య,ప్రకాశం శర్మ, సురేంద్ర శర్మ, జనార్దన్ శర్మల ఆధ్వర్యంలో ఆహ్వాన పత్రికలకు ప్రత్యేక పూజలు నిర్వహించి విడుదల చేశారు. ఏఈఓ మధు, సూపర్డెన్స్ శశిధర్ రెడ్డి, నీలకంటేశ్వర రాజు, సుబ్బారెడ్డి, టెంపుల్ ఇన్స్పెక్టర్ నాగ మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల నిరసన

విశాలాంధ్ర - కోవెలకుంట్ల : ఆంధ్రప్రదేశ్ విద్యుత్ ఉద్యోగులు వారి దీర్ఘకాలిక సమస్యల సాధన కొరకు నిరసన బాట పట్టారు. దశలవారీగా ఆందోళన కార్యక్రమానికి ఏపీ ఎస్పీఈ జేఏసీ ఇచ్చిన పిలుపులు మేరకు వారి విద్యుత్ ఉద్యోగుల డిమాండ్ల సాధనకై దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. అందులో భాగంగా సోమవారం స్థానిక విద్యుత్ ఉద్యోగులు కార్యాలయం ముందు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. 12 డిమాండ్లతో కూడుకున్న సాధనకై ఉద్యోగులు నిరసన బాట పట్టారు. పెండింగ్లో ఉన్న డీఏ బకాయిలతో పాటు జేఎల్ఎం గ్రేడ్-2 ఉద్యోగులను క్రమబద్ధీకరణ పాటు కారుణ్య నియామకాలు చేపట్టాలన్నారు.

విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ

విశాలాంధ్ర - ఉయ్యాలవాద: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎస్ఎంసి చైర్మన్ చెన్నయ్య సోమవారం విద్యార్థు లకు 30 జతల క్రీడా దుస్తులు ఉచితంగా అందిం చారు. ఈ సందర్భంగా సోమ వారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లా డుతూ ఆటల్లో స్కూల్‌కు, ఉయ్యాలవాడ గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని చెప్పారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయ కుమార్ మాట్లాడుతూ చదువుతో పాటు ఆటలు కూడా బాగా ఆడి రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయిలో పాల్గొని పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర - మిడుతూరు: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ మల్లు వెంకటేశ్వరమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో దశరథ రామయ్య సోమవారం తెలిపారు. మండల సర్వసభ్య సమావేశానికి వివిధ శాఖల అధికారులు తమ శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలతో హాజరుకావాలని సూచించారు. మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచులు, జడ్పిటిసి, ప్రజా ప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

యాగంటి ఉమామహేశ్వరలకు పల్లకి సేవ

విశాలాంధ్ర బనగానపల్లె రూరల్: మండలంలోని యాగంటి క్షేత్రంలో వెలసిన ఉమా మహేశ్వరస్వామి ఆలయం లో సోమవారం స్వామివారి పల్లకీ సేవ ఘనంగా జరిగింది. ఆలయంలో కొలువైన ఉమామహేశ్వర స్వామికి ఉదయం అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలను పల్లకీలో కొలువుదీర్చి పల్లకీ సేవ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి పాండురంగారెడ్డి, యాగంటి పల్లె మౌళిశ్వర రెడ్డి, పాతపాడు సర్పంచ్ మహేశ్వరరెడ్డి, ఆలయ అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులను పరిష్కరించాలి

విశాలాంధ్ర - బనగానపల్లె: ప్రజా సమస్యల పరిష్కారం కోసం వచ్చే దరఖాస్తులను (అర్జీలు) రెవిన్యూ సిబ్బంది, వీఆర్వోలు పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని మండల తాహసిల్దార్ నారాయణ రెడ్డి సూచించారు. సోమవారం నాడు స్థానిక తాహసిల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్య పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజలు రైతులు నుంచి వచ్చిన అర్జీలను తహసీల్దార్ నారాయణరెడ్డి స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జీ ఎంపీడీవో నాగరాజు, పంచాయతీరాజ్ ఏఈ వెంకటరమణ, మండల విద్యాధికారి స్వరూప1 శ్రీనివాసులు2 ఏపీఎం హజరత్, ఏపీ ఎన్జీవో ప్రతాప్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ సాయి కృష్ణ, హౌసింగ్ ఏఈ బాలచంద్రుడు ,వెటర్ని డాక్టర్ బ్రహ్మానందరెడ్డి, ఐసిడిఎస్ సూపర్వైజర్ పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

సనాతన ధర్మంపై ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకే ఇస్కాన్ ఆధ్వర్యంలో పాదయాత్ర

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : సనాతన వేదిక ధర్మంపై ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు ఇస్కాన్ చేపట్టిన పాదయాత్ర సోమవారం అహెూబిలం చేరుకున్నది. సనాతన ధర్మం కోసం ఎద్దుల బండితో చేపడుతున్న పాదయాత్ర ఇప్పటికే ఆరుసార్లు పూర్తికాగా, ప్రస్తుతం ఏడవ సారి దేశవ్యాప్తంగా కొనసాగుతోంది. ఈ సందర్భంగా అహెూబిలం ఇస్కాన్ ప్రతినిధి చంద్ర కేశవ దాస్ మాట్లాడుతూ సనాతన హిందూ ధర్మం ఎంతో గొప్పదని దాన్ని కాపాడాలి అంటే ప్రజల్లో చైతన్యం చేస్తూ తాము ఈ పాదయాత్రకు శ్రీకారం చుట్టామని చెప్పారు. కేదార్నాథ్, బద్రీనాథ్, ద్వారక, పూరి, శ్రీ కూర్మం క్షేత్రాలను తిరగడం జరిగిందన్నారు. అక్కడి నుండి మంగళగిరి, గుంటూరు, మార్కాపురం, గిద్దలూరు మీదుగా నంద్యాల, రుద్రవరం మీదుగా అహెూబిలం క్షేత్రం చేరుకున్నామన్నారు. అహెూబిలం తర్వాత తిరుపతి ,రామేశ్వరం వరకు పాదయాత్ర కొనసాగుతుందన్నారు. ప్రతిరోజు ఎద్దుల బండి తోపాటు 10 కిలోమీటర్లు యాత్ర సాగుతుందన్నారు. 1964లో తొలిసారి ద్వారకలో మొదలైన యాత్ర ఆరుసార్లు పూర్తి చేసుకోవడం జరిగిందన్నారు. ఏడవ యాత్ర 2021లో ప్రారంభించామన్నారు. ఇస్కాన్ ప్రతినిధులు మహారాష్ట్రకు చెందిన ఆచార్య దాస్, మోహన గోపాల్, భద్ర బలరామదాస్ ఆంధ్రప్రదేశ్ కు చెందిన అమలవి మైదాస్ తదితరులు సనాతన ధర్మంపై ప్రజలకు అవగాహన కల్పించారు. అంతకు ముందు అహెూబిలంలోని ఇస్కాన్ టెంపుల్ లో ఇస్కాన్ బృందం వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ట్యాబులు స్వాదినం.. ఇద్దరు అరెస్ట్

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: నంద్యాల మొదటి పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో మున్సిపల్ హైస్కూల్ దగ్గర గల డిప్యూటీ విద్యాశాఖాధికారి కార్యాలయం ప్రక్క గదిలో జరిగిన దొంగతనం కేసులో ముద్దాయిలను అరెస్టు చేసినట్లు నంద్యాల ఎఎస్పీ మందా జావళి అల్ఫోన్స్ తెలిపారు. సోమవారం నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఏపి సమగ్ర శిక్షా కార్యాలయంలో అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్‌గా పని చేస్తున్న బత్తుల దస్తగిరి రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయబడిందని, ఈ మేరకు నంద్యాల టౌన్ బీమవరము రోడ్డులో ఈద్గా సమీపంలో కేసులో నిందితులైన చాంద్ బాడ వీధికి చెందిన షేక్ హుస్సేన్ వలి, మరో మైనర్ బాలుడుని అరెస్టు చేసి, వారి వద్ద నుండి సుమారు రూ.6.93 లక్షల విలువైన 77 ట్యాబ్స్, 60 అడాప్టర్లు, 150 కేబుల్స్, రెండు స్పైక్ గార్డ్‌ను రికవరీ చేయడం జరిగిందన్నారు. నంద్యాల మొదటి పట్టణ టౌన్ ఇన్స్పెక్టర్ సుధాకర్ రెడ్డి, వారి సిబ్బంది రమణ, సుబ్బయ్య, షేక్ అమీర్ బాష, గురుశేఖర్ కలిసి సమర్థవంతంగా ఛేదించారని, జిల్లా ఎస్పీ సునీల్ షేరాన్ వారిని ప్రత్యేకంగా అభినందించినట్లు ఏఎస్పీ తెలిపారు.

ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించండి

విశాలాంధ్ర - నంద్యాల అర్బన్: ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర సమితి పిలుపు మేరకు ఏఐటీయూసీ నంద్యాల జిల్లా సమితి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. పట్టణ అధ్యక్ష కార్యదర్శులు భూమని శ్రీనివాసులు, డి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో పట్టణంలోని నూనెపల్లె కలెక్టర్ కార్యాలయం దగ్గర రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం చేపట్టారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రఘురామమూర్తి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లడుతూ వాహన మిత్ర పథకం కింద రూ.15 వేలు కాకుండా ప్రతి కార్మికునికి రూ.25 వేలు ఇవ్వాలన్నారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

విశాలాంధ్ర - రుద్రవరం: మండలంలో గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు తమ సమస్యలను పరిష్కరించాలని సోమవారం ఎంపీడీవో సుబ్రహ్మణ్యంకు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం తమ డిమాండ్లను పట్టించుకోకపోతే సమ్మెకు దిగుతామని ఉద్యోగులు హెచ్చరించారు. వివిధ గ్రామాల సచివాలయాల ఉద్యోగులు మాట్లాడుతూ 2019లో నియమితులైన తమ ప్రొబేషన్‌ను వెంటనే డిక్లేర్ చేసి, స్కేల్ ఇవ్వాలన్నారు. దాదాపు 1.25 లక్షల మంది ఉద్యో గులు ఈ ప్రక్రియ కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. ప్రతిరోజూ 14 రకాల అదనపు బాధ్యతలు నిర్వర్తించాల్సి వస్తోందని, వీటి వల్ల పని భారం పెరిగి ఇబ్బందులు పడుతున్నామని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. సిబ్బందికి ప్రతినెలా ఒకటో తేదీన జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం జీతాలు ఆలస్యంగా వస్తుండటంతో ఆర్థిక ఇబ్బం దులు ఎదురవుతున్నాయని తెలిపారు. అర్హత కలిగిన ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని కోరారు. సచివాలయ ఉద్యోగులకు బదిలీలకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయండి

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ: పట్టణంలోని అమ్మవారి శాల లో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఈ ఏడాది అత్యంత ఘనంగా నిర్వహిస్తున్నట్లు వీటిని విజయవంతం చేయాలని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు దేవిశెట్టి హరీష్ బాబు తెలిపారు. స్థానిక అమ్మవారి శాలలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 22 నుండి అక్టోబర్ రెండో తేదీ వరకు శరన్నవరాత్రి ఉత్సవాలు జరుపుతున్నట్లు తెలిపారు. ఈ ఏడాది విశేషంగా 11 రోజులపాటు అమ్మవారి ఉత్సవాలు రావడం జరిగిందన్నారు. నవరాత్రి ఉత్సవాలలో భాగంగా అమ్మవారిశాలను రంగురంగుల విద్యుత్ దీపాలతో, కటౌట్లతో అలంకరించినట్లు తెలిపారు. ఈ నెల 22న రాజరాజేశ్వరి అమ్మవారి అలంకారం, 23న శ్రీ అన్నపూర్ణా దేవి అలంకారం, 24న గాయత్రీ దేవి అలంకారం, 25న శ్రీ బాలా త్రిపుర సుందరి దేవి అలంకారం, 26న తోట ఉత్సవం, శ్రీ లలితా పరమేశ్వరి అమ్మవారి అలంకారం, 27న శ్రీ మహాలక్ష్మి దేవి అలంకారం, 28న శ్రీ శారదా దేవి అలంకారం, 29న మూలా నక్షత్రం శ్రీ సరస్వతీ దేవి అమ్మవారి అలంకారం, 30న శ్రీ దుర్గాష్టమి పర్వదినం సందర్భంగా శ్రీ మహిషాసుర మర్దిని దేవి అలంకారం, అక్టోబర్ 1న శ్రీ దుర్గాదేవి అలంకారం, 2న దసరా సందర్భంగా శ్రీ విజయలక్ష్మి దేవి అలంకారం, 3న పాన్పు సేవ అలంకారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తమిళనాడు అంబురు కు చెందిన అలంకార నిపుణులు సౌందర్య రాజన్ ఆధ్వర్యంలో అమ్మవారికి నిత్య అలంకరణ ఉంటుందని తెలిపారు. గ్రామోత్సవ రోజున విశేష బాణసంచాతో పాటు, ప్రతినిత్యం సాంస్కృతిక కార్యక్రమాలు, చండీ హెూమ కార్యక్రమం లోక కళ్యాణార్థం ప్రత్యేకంగా ఏర్పాటు చేసినట్లు హరీష్ బాబు తెలిపారు.ఆర్యవైశ్య సంఘం, దసరా పండుగ కమిటీ, అహోపా, శ్రీ వాసవి మహిళా సంఘం, శ్రీ వాసవి యువజన సంఘం, శ్రీ వాసవి సేవాదళ్ సభ్యుల సహాయ సహకారాలతో ఈ ఏడాది ఉత్స వాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

బైరెడ్డి సిద్దార్థ రెడ్డి వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: బైరెడ్డి సిద్దార్థ రెడ్డి వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని, నారా లోకేష్‌ను విమర్శించే స్థాయి బైరెడ్డి సిద్దార్థరెడ్డికి లేదని టీడీపీ యువ నాయకుడు భూమా జగత్ జగత్ విఖ్యత్ రెడ్డి అన్నారు. సోమవారం టీడీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో భూమా జగత్ విఖ్యత్ రెడ్డి మాట్లాడుతూ మిథున్ రెడ్డికి రాష్టంలో పెరుగుతున్న ఆదరణ చూడలేక నారా లోకేష్ కు పోటీ వస్తాడనే ఉద్దేశ్యంతోనే మిథున్ రెడ్డిని అక్రమంగా అరెస్టు చేశారని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సంక్షేమం, అభివృద్ధి, పెట్టుబడులు లక్ష్యం గా సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు. రాష్టాన్ని అభివృద్ధి వైపు నడిపిస్తుంటే వైసీపీ నాయకులు అడ్డుకుంటున్నారని విమర్శలు గుప్పించారు. కూటమి పాలనలో ఇచ్చిన హామీలు అమలు చేశామని సూపర్ సిక్స్ పథకాలు సూపర్ అని రాష్ట్ర ప్రజలు అంటున్నారని తెలిపారు. గత ఐదేళ్ల సైకో పాలనను భరించలేక కూటమిని ఎన్నుకున్నారన్నారు. ఎన్నికల ముందు జంబో డీఎస్సీ విడుదల చేస్తామని చెప్పిన విదంగానే కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే మొదటి సంతకం డీఎస్సీపై పెట్టి నేడు ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటున్నామన్నారు. నేపాల్‌లో జరుగుతున్న సంఘటనల నేపథ్యంలో తెలుగు ప్రజలు అక్కడ ఉంటే వారిని సురక్షితంగా మన రాష్టానికి నారా లోకేష్ తెప్పించారని గుర్తు చేశారు.ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకోవాలని భూమా జగత్ విఖ్యత్ రెడ్డి వైసీపీ నాయకులకు సలహా ఇచ్చారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు కృపాకర్, పల్లె వెంకట సుబ్బయ్య, గఫార్ తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

విశాలాంధ్ర కర్నూలు
www.visalaandhra.com
కర్నూలు, మంగళవారం 16, సెప్టెంబర్ 2025

విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడవద్దు

- శిథిల వ్యవస్థకు చేరుకున్న పాఠశాలల మరమ్మత్తులను వెంటనే చేపట్టాలి

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్ : జిల్లా వ్యాప్తంగా ఉన్న చాలా ప్రభుత్వ పాఠశాలలు శిథిల వ్యవస్థకు చేరుకునే వాటిని మరమ్మతు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్ నవ్యకి మెమోరాండం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి, సోమన్న, ఎస్.షాబీర్ బాషలు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా వర్షాలు ఎక్కువ పడడం ద్వారా జిల్లాలో చాలా ప్రభుత్వ పాఠశాలలో పైకప్పులు ఊడి శిథిల వ్యవస్థకు చేరుకున్నాయన్నారు. ఇటీవల భారీ వర్షం పడడం ద్వారా కోసిగి మండలంలో ఉన్న ఎంపీపీ స్కూల్ పైకప్పు ఊడి విద్యార్థులపై పడిందని, విద్యార్థులకు ఎలాంటి ప్రాణహాని జరగకుండా స్వల్ప గాయాలతో విద్యార్థులు బయట పడ్డారన్నారు. కోడుమూరులో ఉన్న పాఠశాలలో పైకప్పులు ఊడి పడ్డాయన్నారు. సోమవారం కర్నూలు నగరంలోని కీర్తి స్కూల్‌లో గోడలుపడి విద్యార్థి మృతి చెందాయని, అనేక గ్రామాల్లో వర్షం పడితే స్కూల్‌కు వెళ్లే దారి సరిగా లేక విద్యార్థులు స్కూలుకు వెళ్ల లేని పరిస్థితి గ్రామాల్లో ఉందన్నారు. ప్రభుత్వాలు మారిన విద్యార్థుల భవిష్యత్తు మారడం లేదన్నారు. ఏ ప్రభుత్వం అయినా ఎన్నికల ముందు విద్యార్థులకు అనేక హామీలు ఇచ్చి తీరా అధికారంలోకి వచ్చాక, దాన్ని అమలు చేయడంలో పూర్తిగా వైఫల్యం చెందాయన్నారు. ఇప్పటికైనా జిల్లా విద్య శాఖ అధికారులు జిల్లాలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలను పర్యవేక్షించి పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టి, మౌలిక వసతులు కల్పించి విద్యార్థులకు ఎలాంటి హాని జరగకుండా చూడాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎఫ్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి, వీరేష్, ఏఐఎస్ఎఫ్ నగర అధ్యక్ష కార్యదర్శి, అభి, అశోక్,నగర నాయకులు, వరుణ్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

సురవరం సేవలు చిరస్మరణీయం : సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

విశాలాంధ్ర -ఆలూరు: మండలంలోని మొలగవల్లి గ్రామంలో ఎర్ర జెండా కోసం కామ్రేడ్ సురవరం సుధా కర రెడ్డి చేసిన పోరాటాలు ఎల్లప్పుడూ చిరస్మరణీయంగా ఉంటాయని, ప్రజా నాయకుడిగా పేదలు కార్మికులు, రైతుల కోసం అహర్నిశలు ఆయన సాగించిన పోరాటం ఎప్పటికీ చిరస్మరణీయమై ఉంటాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. నిరుపేదల కోసం ఆయన త్యాగం వృధా కాదని, వారి ఆశ యాలను భవిష్య త్తులో కొనసాగిస్తామని ఆయన పేర్కొన్నారు. సోమవారం మొలగవల్లి గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సీపీఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పార్లమెంటు సభ్యులు, దివంగత నేత కామ్రేడ్ సురవరం సుధాకరరెడ్డి సంస్మరణ సభ ఘనంగా నిర్వహిం చారు. ఈ సభకు సీపీఐ జిల్లా సమితి సభ్యుడు భూపేష్ అధ్యక్షతన జరిగిన సంస్మరణ సభకు ముఖ్య అతిథులుగా సిపిఐ రాష్ట్ర సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పాల్గొన్నారు. ఆయన ముందుగా వారు సుధాకరరెడ్డి చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సురవరంకు నివాళులు అర్పిస్తూ రెండు నిముషాలు మౌనం పాటించారు. అనంతరం జోహార్ సురవరం.. జోహార్.. జోహార్ అంటూ పెద్ద ఎత్తున విప్లవ వందనాలు చేశారు. సంస్మరణ సభను ఉద్దేశించి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ కామ్రేడ్ సురవరం సుధాకర రెడ్డి విద్యార్థి దశ నుండే కర్నూలు ఉస్మానియా కాలేజీలో చదువుతూ, అత్యంత ఉన్నత స్థానం సంపాదించి విద్యార్థి, యువజన నాయకుడిగా పని చేస్తూ, సిపిఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎనలేని సేవలు చేశారని కొనియాడారు. ఆయన రెండు సార్లు నల్లగొండలో ఎంపిగా గెలిచి ఏనాడు పదవులు ఆశించలేదని గుర్తు చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రామచంద్రయ్య మాట్లాడుతూ కామ్రేడ్ సురవరం సుధాకరరెడ్డి నిజాయితీ, క్రమశిక్షణ, సేవా తపన ప్రతి ఒక్కరికీ ఆదర్శమని అలాంటి గొప్ప నాయకుడితో ఉన్న అనుబంధం గర్వకారణ మన్నారు. నమ్మిన సిద్ధాంతం కోసం 65ఏళ్ళు నిబద్ధతతో జీవించిన వ్యక్తి కామ్రేడ్ సురవరం అన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య మాట్లాడుతూ సురవరం సుధాకర రెడ్డి మరణం తమ పార్టీకి తీరని లోటని చెప్పారు. కమ్యూనిస్టు పార్టీ నాయకుడిగా సురవరం సుధాకరరెడ్డి ప్రజా సమస్యలపై అలుపెరుగని పోరాటం చేశారన్నారు. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆవుల శేఖర్ మాట్లాడుతూ, సురవరం సుధాకరరెడ్డి మనసున్న మహనీయుడని చెప్పారు. ఉద్యమబాటలో నిరంతరం పేద, బడుగు, బలహీన వర్గాల

అభివృద్ధి కోసం పోరాడిన విప్లవ శిఖరమన్నారు. సిపిఐ నాయకులు చేతివృత్తుల రాష్ట్ర కార్యదర్శి రామాంజనేయులు, ఓంకార్, నబి రసూల్, సీపీఐ మండల కార్యదర్శి రామాంజనేయులు, మద్దిలేటి శెట్టి, ఏఐటీయూసీ తాలూకా రంగన్న, ఎస్ఎస్ భాష, వైసీపీ మాజీ మండల కన్వీనర్ చిన్న ఈరన్న, సీపీఐ సీనియర్ నాయకులు సుబ్బారెడ్డి, ఎర్రి స్వామి, మొలగవల్లి సర్పంచ్ మోహన్ రాజ్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ రామ్నాథ్ యాదవ్, టిడిపి మండల కన్వీనర్ అశోక్ యాదవ్, సీపీఐ, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

గ్రామ సభలు పెట్టకుండా, అభిప్రాయాలు తీసుకోకుండా భూములు ఇస్తారా..

విశాలాంధ్ర -ఆలూరు : పవర్ గ్రిడ్ ప్రాజెక్టు కోసం సారవంతమైన సాగు భూములు లాక్కో వడం తగదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామ కృష్ణ అన్నారు. ఆలూరు మండలం మనేకుర్తి గ్రామంలో సోమవారం సాయంత్రం పొలాలను సీపీఐ, సీపీఐ(ఎం) నాయకుల బృందం పరిశీలించారు. గ్రామ రైతులు మాట్లాడుతూ భూముల మీద ఆధారపడి జీవిస్తున్న తమకు న్యాయం చేయాలని, లేని పక్షంలో తమకు ఆత్మహత్యలే శరణ్యమని రైతులు రామకృష్ణకు మొర పెట్టుకున్నారు. ఆయన మాట్లాడుతూ సారవంతమైన భూముల్లో పవర్ గ్రిడ్ ప్రాజెక్టు ఏర్పాటు చేయడం వల్ల రైతులు నష్టం జరుగుతుందని అన్నారు. ప్రభుత్వం ప్రాజెక్టుపై పునరాలోచన చేయా లని డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రామచంద్రయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, చేతివృత్తుల రాష్ట్ర కార్యదర్శి రామాంజనేయులు, ఆదోని వీరేష్, బసాపురం గోపాల్, కారెన్న, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సుదర్శన్, సీపీఐ(ఎం) జిల్లా ప్రధాన కార్యదర్శి గౌస్ దేశాయ్, సీపీఐ(ఎం) జిల్లా నాయకులు జిల్లా అధ్యక్షులు వెంకటేశులు, నాయకులు పి.హనుమంత్, నారాయణస్వామి పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు విడుదల చేయాలి

విశాలాంధ్ర - కర్నూలు: ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు మంజూరు చేయాలని డీహెచ్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సి.మహేష్ డిమాండ్ చేశారు. సోమ వారం జెసి నవ్యకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు గత నాలుగేళ్ల నుంచి నిధులు విడుదల చేస్తూ వాటిని ఇతర సంక్షేమ పథకాలు మళ్లించార న్నారు. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సమైనా, ఇంతవరకు ఆ నిధులకు సంబంధించి ఎలాంటి ఆలోచన చేయ లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. నిధులు విడుదల చేసి, ఎస్టి కాలనీ, ఎస్సీ కాలనీలా అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. ఉచితంగా విద్య, వైద్యం అందించాలని, వీటితోపాటు ఉపాధి అవకాశాలు కల్పించాలని. పోరంబోకు భూములను ఎస్సీ ఎస్టీలకు పంచి కోనేరు రంగారావు భూ సిఫార సులను అమలు చేయాలని, గిరినేతర చేతుల్లో ఉన్న వందలాది ఎకరాల భూములను పేద గిరిజనులకు పంచాలన్నారు. దళిత గిరిజనుల అభివృద్ధికి తోడ్పాడాలని, ఆ నిధుల ద్వారా చిన్నచిన్న వ్యాపారాలు గ్రామీణ ప్రాంతాల్లో ఎస్సీ వ్యవసాయ దారులకు వారి స్వయం ఉపాధి కూడా తోడ్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సమాఖ్య నాయకులు లోకేష్ రామాంజనేయులు డీహెచ్‌పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు. ఎం.బీసన్న కోశాధికారి సి.కుమాం, సీపీఐ జిజిల్లా కార్యవర్గ సభ్యులు కె.శ్రీనివాసులు, జిల్లా నాయకులు కుమార్ భద్ర తదితరులు పాల్గొన్నారు.

ఉచిత బస్సుతో ఆటోవాలాల జీవనాధారం కష్టంతరం

విశాలాంధ్ర - ఆదోని : రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఫ్రీ బస్సు ఏర్పాటు చేయడం వల్ల ఆటో నడిపి జీవనం సాగించే కార్మికుల పరిస్థితి దుర్భరంగా మారిందని

ఏఐటియుసి జిల్లా అధ్యక్షుడు అజయ్ బాబు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఏఐటియుసి ఆటో యూనియన్ నియోజకవర్గ అధ్యక్షుడు భీమేష్ అధ్యక్షతన సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి వినతిపత్రం అందజేశారు. కూటమి ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు జీవన ఉపాధి కింద నెలకు రూ.5 వేలు చొప్పున సంవత్సరానికి 60 వేలు ఇవ్వాలన్నారు. ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలనిన్నారు. ఏఐటియుసి పట్టణ కార్యదర్శి వెంకన్న, ఆటో యూనియన్ నాయకులు జోసఫ్, ప్రహ్లాద్,అఖిల్, కృష్ణ, మాజీ ఏఐవైఎఫ్ రాష్ట్ర నాయకులు ఎం గిరిమలప్ప, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తపడి ఒకరు మృతి

విశాలాంధ్ర - క్రిష్ణగిరి. అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తా పడి ఒకరు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని కంబాలపాడు గ్రామ సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. కోయిలకొండ గ్రామానికి చెందిన కొంతమంది కూలీలు దేవనంకొండ మండలం పి.కోటకొండ గ్రామంలో పని నిమిత్తమై కూలీలు ట్రాక్టర్లో వెళ్తుండగా, ముందర టైర్ బేరింగ్ ఫెయిలైంది. దీంతో ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడిందన్నారు. ఈ ప్రమాదంలో మంథ్ల సరస్వతి (39) అక్కడికక్కడే మృతి చెందగా రవి అనే యువకుడుకి స్వల్పంగా గాయాలయ్యాయి. మిగిలిన వారికి ఎలాంటి దెబ్బలు తగల్లేదని వారు తెలిపారు. మృతురాలు భర్త బాలమది ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. మృతురాలికి ఇద్దరు కూతుర్లు, కుమారుడు ఉన్నారు. అందరికీ వివాహమైనది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వెల్దుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఆటో కార్మికుల సమస్యల పరిష్కరించకపోతే అసెంబ్లీ ముట్టడిస్తాం

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : ఆటో కార్మికుల సమస్యల పరిష్కరించకపోతే అసెంబ్లీ ముట్టడిస్తామని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మునెప్ప అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ఏపీ ఆటో అండ్ డ్రైవర్స్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ ధర్నాకు ఆటో యూనియన్ నగర అధ్యక్షులు రాము అధ్యక్ష వహించారు. ఈ ధర్నా కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మునెప్ప, ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఈశ్వర్ హాజరై, మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలన్నారు. స్త్రీ శక్తి పథకం కింద నష్టపోతున్న ఆటో కార్మికులకు నెలకు రూ.5 వేలు ఇచ్చి కార్మికులను ఆదుకోవాలన్నారు. ఏఐటియుసి నగర అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేష్, చంద్రశేఖర్, డిప్యూటీ కార్యదర్శి రామాంజనేయులు, ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి గణేష్, ఆటో వర్కర్స్ యూనియన్

నగర కార్యదర్శి ఆర్.కృష్ణారెడ్డి, ఆటో వర్కర్ యూనియన్ నాయకులు ఈశ్వర్ రెడ్డి, నాగరాజ్, జయరాం రెడ్డి, అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - పెద్దకడబూరు : మండల పరిధిలోని వివిధ గ్రామాలలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు భాస్కర్ యాదవ్, మండల కార్యదర్శి వీరేష్ డిమాండ్ చేశారు. సోమవారం పెద్దకడబూరులోని స్థానిక సిపిఐ కార్యాలయం నందు కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో ఆయా గ్రామాలలో వర్షపు నీరు కారణంగా డ్రైనేజీలు పూడికతో నిండుకొని నీరు ఇళ్లలోకి వెళ్లే పరిస్థితి ఏర్పడిందన్నారు. డ్రైనేజీలలో పూడిక పేరుకోపోయి నీరు నిల్వ ఉండడంతో దోమలు విపరీతంగా పెరగడంతో ప్రజలు విష జ్వరాలు, డెంగ్యూ వంటి అనారోగ్యంతో బాధపడుతున్నా సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. గ్రామాల్లో నెలకొన్న తాగునీటి, పారిశుధ్యం, వీధి దీపాలు వంటి సమస్యలు పరిష్కరించాలని లేనిపక్షంలో ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి తిక్కన్న, నాయకులు సుభాన్, గూడు ఖాజా, మునిస్వామి, నభీ, కాశీం తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్స్ వ్యవస్థను కొనసాగించాలి

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : రాష్ట్ర వ్యాప్తంగా వాలంటీర్స్ వ్యవస్థను కొనసాగించి, వారి పెండింగ్ వేతనాలు చెల్లించి రాష్ట్రవ్యాప్తంగా 2.60 లక్షల మంది న్యాయం జరిగే విధంగా అసెంబ్లీలో చర్చించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వాలంటీర్స్ అసోసియేషన్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జాయింట్ కలెక్టర్‌కి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి కె శ్రీనివాసులు, నగర కార్యదర్శి బీసన్న, వాలంటీర్స్ అసోసియేషన్ నాయకులు కుమారు, మహబూబ్ బాష, సుకన్యలు, మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కూటమి నాయకులు వాలంటీర్స్ ఆందోళన చెందవద్దని కూటమి ప్రభుత్వం అధికారం వచ్చిన మిమ్మల్ని కొనసాగిస్తామని, రూ.10 వేల వేతనం ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. అధికారం చేపట్టి 15 నెలలు గడుస్తా ఉన్న వాలంటీర్ వ్యవస్థ గురించి పట్టించుకోకపోవడం సిగ్గుచేటు అన్నారు. దీనివల్ల రాష్ట్ర వ్యాప్తంగా 2 లక్షల 60 వేల కుటుంబాలు తీవ్ర

గందరగోళంలో ఉన్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వాలంటీర్స్, రామాంజినేయులు, రాజశేఖర్, నూర్ బాష రామాంజి, షాకీర్ బాషా, మీనా కుమారి, రెస్మా, సైయాద్ బాష, అల్తాబ్ బాష, తార, పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

విశాలాంధ్ర - కర్నూలు సిటీ: నగరపాలక సంస్థ పరిధిలోని 34వ వార్డులో తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ సోమవారం నగరపాలక కార్యాలయం ఎదుట సీపీఐ నగర కమిటీ ఆధ్వర్యంలో ప్రజలు నిరసన తెలిపారు.

సిపిఐ నగర సహాయ కార్యదర్శి డి.శ్రీనివాసరావు అధ్యక్షతన కార్యక్రమంలో నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి హాజరై మాట్లాడారు. 34వ వార్డులోని సిపిఐ కొట్టాల్లో నివసిస్తున్న సుమారు 70 కుటుంబాలు త్రాగడానికి నీరు లేక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. పేదలు కూలీ పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారని తెలిపారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజే శారు. కార్యక్రమంలో సిపిఐ నగర కార్యవర్గ సభ్యులు నాగ రాజు, అన్వర్ భాష, శాఖా కార్యదర్శులు రామాంజనేయులు, రబియా, ధనలక్ష్మి, అబ్రహం, రాముడు, కాలనీవాసులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలోనే రహదారులకు మరమ్మత్తులు

విశాలాంధ్ర - ఆదోని రూరల్: ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలోనే రహదారులకు మరమ్మత్తులు చేపట్టడం జరుగుతుందని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, నియోజకవర్గ మాజీ ఇంచార్జ్ గుడిసె ఆదికృష్ణమ్మ అన్నారు. సోమవారం కొత్త ఓల్డ్ బ్రిడ్జి మీదిల్లో ఉన్న రహదారిపై వర్షపు నీరు నిలిచి ఉండడంతో ఆమె పరిశీలించారు. అక్కడ ఉన్న సంఘటనను చూసి సంబంధిత శాఖ అధికారులకు ఫోన్ చేసి విషయం తెలిపారు. అధికారులు సానుకూలంగా స్పందిస్తూ రహదారి మరమ్మత్తులకు శాంక్షన్ అయిందని, వర్షం నిలిచిన తక్షణమే మరమ్మతులు పనులు పూర్తి చేస్తామని సమాధానం ఇచ్చినట్లు ఆమె మీడియాకు తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో రహ దారులు అధ్వాన్నంగా మారాయని, సంక్షేమము పేరుతో రాష్ట్రంలో మోయలేనన్ని అప్పులు మోపారని జగన్ తీరుపట్ల ఆగ్రహ వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి రాంభి నాయుడు, మాజీ ఎంపీపీ మురళి, మల్లయ్య బంగారు బాబు, స్థానిక నాయకులు విజయ్, పెద్ద చిట్టి, చిన్న చిట్టి, దేవినగర్, నాయకులు పాల్గొన్నారు.

పాము కాటుకు యువకుడు మృతి

విశాలాంధ్ర - ఆలూరు : ఆలూరు మండలంలో అరికెర గ్రామానికి చెందిన కుప్పగంటి రవి (32) యువకుడు పాముకాటుకు గురై మృతి చెందాడు. సోమవారం మృతుడు బంధువులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పొలం పనులు చేస్తుండగా కాలిపై విష సర్పం కాటు వేసింది. పాము కాటుకు గురైన రవి కేకలు వేయడంతో వెంటనే కుటుంబ సభ్యులు స్పందించి ద్విచక్ర వాహనంపై ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లగా. అప్పటికే అతను మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి తల్లిదండ్రులతో పాటు భార్య లలితమ్మ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమారుడు అర్ధంతరంగా మృతి చెందడంతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగారు.

మంచినీళ్ల కొళాయి కనెక్షన్ ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్న పంచాయతీ కార్యదర్శి

విశాలాంధ్ర - కర్నూలు : క్రిష్ణగిరి మండలం ఎరుకల చెరువు గ్రామంలో రామాంజనేయులుకు గత రెండేళుగా గ్రామంలో మంచి నీటి కొళాయి కనెక్షన్ కావాలని సర్పంచ్ ఇంటికి, సచివాలయం పంచాయతీ కార్యదర్శి దగ్గరికి వెళ్లి మంచినీళ్ల కొళాయి కనెక్షన్ కావాలని అడుగుతున్న పట్టించుకోవడం లేదని మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ పి.శ్రావణి రెడ్డి అన్నారు. సోమవారం ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో స్పందన కార్యక్రమంలో జెసిని కలిసి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ పి.శ్రావణి రెడ్డి, మహిళా సమాఖ్య నగర నాయకురాలు పావని, ఆశాబేగం, సులోచనమ్మ, మునెమ్మ, నాగేశ్వరమ్మ, సిపిఐ నగర కార్యవర్గ సభ్యులు బీసన్న, భద్రకుమార్ జేసీని కలిసి తక్షణమే కొళాయి కనెక్షన్ ఇప్పిచ్చేటట్లు చర్యలు తీసుకోవాలని పంచాయతీ సెక్రెటరీని సస్పెండ్ చేయాలని సర్పంచ్‌పై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

గంజాయి రవాణా ముఠా గుట్టు రట్టు

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : ఒరిస్సా బార్డర్ నుండి అక్రమం గా గంజాయి రవాణా జరుగుతున్న దన్న సమాచారం మేరకు ఆదివారం తనిఖీ చేయగా గంజాయి రవాణా చేస్తున్న ముఠాను వారి వాహనం, గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు డిఎస్పీ బాబు ప్రసాద్ తెలిపారు.

నగర ములోని 4వ పట్టణ పోలీస్ స్టేషన్లో ఆయన పాత్రికేయుల ముందు నిందితులను హాజరు పరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి అక్రమంగా రవాణా చేస్తున్నారు అన్న సమాచారంతో సిఐ విక్రమ సింహా, ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి, సిబ్బంది, తహసీల్దార్ ఆంజనేయులు ఆధ్వర్యంలో వాహనాలు ఫ్లై ఓవర్ బిడ్జిపై తనిఖీ చేస్తుండగా ఏపీ 40 ఎన్3258 అను నెంబర్ గల వాహనంలో అనుమానం వచ్చి పరిశీలించగా అందులో ప్రయాణిస్తున్న 5 మంది యువకులు అరకు నుండి వస్తున్నామని చెప్పారన్నారు. వారు ప్రయాణిస్తున్న వాహనంలో తహసీల్దార్ సమక్షంలో తనిఖీలు నిర్వహించినగా కారు డోర్‌లలో భద్రంగా దాచి ఉంచిన గంజాయి బయట పడిందన్నారు. అక్కడ కిలో 18 నుండి 20 కేజీలు రూ.80 వేలకు కొనుగోలు చేసినట్లు తెలిపారన్నారు. ఇక్కడ రూ.500 ప్యాకెట్లు అమ్ముతున్నారన్నారు. కారులో గంజాయి రవాణా చేస్తున్న మీనుగ నాగేంద్ర, ఉమేష్ చంద్ర, మృత్యున్‌జయ రెడ్డి, షేక్ మహ్మద్ అరిఫ్, చాకలి గోవర్ధన్‌లను అరెస్ట్ చేశామన్నారు.

ధైర్యం ఉంటే అభివృద్ధిపై చర్చకు సిద్ధమా : టీడీపీ

విశాలాంధ్ర - నందవరం: ఎమ్మిగనూరు నియోజకవర్గంలో అభివృద్ధిపై చర్చించేందుకు వైసిపి నాయకులు సిద్ధమా అని టిడిపి మండల అధ్యక్షులు కాశీం వలి, జిల్లా ఉపాధ్యక్షులు మాధవ రావు దేశాయ్, సొసైటీ చైర్మన్

ధర్మపురం గోపాల్, బిసి కార్పొరేషన్ డైరెక్టర్ చిన్న రాముడులు అన్నారు. సోమవారం సొసైటీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మిగనూరులోని వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేసింది ఎమ్మెల్యే బివిజే అని, దాని నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రజలకు అంకితం చేసింది కూడా బీవీ జయ నాగేశ్వర్ రెడ్డి అని అన్నారు. వంద పడకల ఆసుపత్రి నిర్మాణంలో కర్త, కర్మ, క్రియ ఎమ్మెల్యే బివిజే అని, ఎమ్మెల్యే బివిపై ఆరోపణలు చేయడానికి వైసిపి నాయకులు సిగ్గుపడాలని ఎద్దేవ చేశారు. మీ వైసిపి ఐదేళ్ల పాలనలో ఒక్క రూపాయి కూడా ప్రభుత్వ ఆసుపత్రికి నిధులు కేటాయించలేదని అన్నారు. ఎమ్మిగనూరు అభివృద్ధి ప్రదాత ఎవరంటే టక్కును గుర్తుచే పేరు బివి మోహన్ రెడ్డి అని, అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ బీవీ కుటుంబ మన్నారు. ఎమ్మెల్యే బివి జయ నాగేశ్వర రెడ్డి కృషి వల్లే బనవాసి వద్ద టెక్స్ టైల్ పార్కు వచ్చిందని, రూ. 1900 కోట్లతో ఆర్డీఎస్ కుడి కాలువ నిర్మాణం కోసం నిధులు తెస్తే, ఆ ప్రాజెక్టును వైసీపీ పక్కన పెట్టారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు దబ్బా ఈరన్న, సామెల్, బోయ వీరేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులను ఆదుకోవాలి

విశాలాంధ్ర- పత్తికొండ: రాష్ట్ర ప్రభుత్వం ఆటో కార్మికులను ఆదుకోవాలని సిపిఐ మండల కార్యదర్శి యు.కారు మంచి,

ఏఐటియుసి నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు నెట్టి కంటయ్య, రంగన్న, చేతి వృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కారన్న డిమాండ్ చేశారు. సోమవారం ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు స్థానిక చదువుల రామయ్య భవనం నుండి ర్యాలీగా వెళ్లి ఆర్డిఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఉచిత బస్సు పథకాన్ని తీసుకువచ్చి ఆటో కార్మికులకు తీవ్ర అన్యాయం చేయడం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉచిత బస్సు పథకంపై పునరాలోచన చేసి ఆటో కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సిపిఐ మండల సహాయ కార్యదర్శులు కాశి, గిడ్డయ్య గౌడ్, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు గుండు బాష, రాజప్ప, రవి, ఉచ్చన్న, సిద్ద లింగప్ప తదితరులు పాల్గొన్నారు.

కరువు మండలంగా ప్రకటించాలి : సిపిఐ

విశాలాంధ్ర - ఆస్పరి : మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి, పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని సిపిఐ మండల సహాయక కార్యదర్శి ఎం.కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన అతివృష్టి కారణంగా హంద్రీ నది పరివాహక గ్రామాలైన ముత్తుకూరు, పుట్టుకలమర్రి, వలగొండ, బిల్లేకల్లు, పుప్పలదొడ్డి, కైరుప్పల, కారుమంచి తదితర ప్రాంతాలలో పత్తి, మిర్చి, వేరుశనగ వంటి పంటలు నీటమునిగి పూర్తిగా నష్టపోయాయని, రైతులు ఒక్కో ఎకరానికి లక్ష రూపాయల వరకు పెట్టుబడులు పెట్టినా, పంట చేతికి రాకముందే వరదలతో తీవ్ర నష్టాన్ని చవి చూశారని ఆవేదన వ్యక్తం చేశారు. సిపిఐ పట్టణ కార్యదర్శి హనుమంతు, సీనియర్ నాయకులు ఉరుకుందప్ప, గోవిందు, గోపాలు, ఈరన్న పాల్గొన్నారు.

ఆర్టీసీ కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయించాలి : జేసీ

విశాలాంధ్ర - కర్నూలు: కర్నూలు, ఎమ్మిగనూరు, పత్తికొండ, ఆదోని డిపోలలో మెకానికులుగా స్వీపర్లుగా పనిచేసిన కాంట్రాక్ట్ కార్మికులకు గుత్తేదారు నుండి కనీస వేతనాలు అమలు చేయించాలని, పిఎఫ్, ఈ ఎస్ఐ అన్ని రకాల సెలవులు అమలు చేయిం చాలని సోమవారం జాయింట్ కలెక్టర్ నవ్య ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మునెప్ప, ఆర్టీసీ కాంట్రాక్ట్ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి హనీఫ్‌లు ప్రజా సమస్యల పరిష్కార పరిష్కార వేదికలో వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మునెప్ప

మాట్లాడుతూ కర్నూలు జిల్లాలోని ఆర్టీసీ డిపోలలో, బస్టాండ్లలో మెకానిక్‌లు గా, అసిస్టెంట్ మెకానికులుగా, స్వీపర్లుగా పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు ఆర్టీసీ యాజమా న్యంతో చేసుకున్న అగ్రిమెంట్లో పొందుపరిచిన కనీస వేతనాల్ని అమలు చేయడం లే దన్నారు. కార్మికుల జీతాల్లో కోత విధిస్తూ, పిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయకుండా, వారాంతపు సెలవులు, ఆర్జిత సెలవులు, పండగ సెలవులు అమలు చేయకుండా నిబంధనలు ఉల్లంఘిస్తున్న సదరు కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకొని కార్మికులకు న్యాయం చేయాలన్నారు. ఈ కార్య క్రమంలో పాండురంగ, గని, సుందర్రాజు, వెంకటేష్, శీను, కాశీం, అల్లా బకాష్, సూరి, బసప్ప, గోపాల్ తదితర కార్మికులు పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి ఎద్దుల బలప్రదర్శన

విశాలాంధ్ర -గోనెగండ్: మండల కేంద్రంలో వెలసిన శ్రీశ్రీశ్రీ ఆది చింతల మునిస్వామి నల్లారెడ్డి స్వామి వారి దశమి మహోత్సవం సందర్భంగా ట్రాక్టర్ యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి ఒంగోలు ఎద్దుల బలప్రదర్శన ట్రాక్టర్ యూనియన్ నాయకులు కె. ఉసేన్, గానిగ రహామ్ తుల్లా, శివన్న, డి.నూర, గోపాల్, వెంకటేష్, మాబు, భాస్కర్‌లు నిర్వహించినట్లు తెలిపారు. మూడ్రోజుల నుంచి దశమి మహోత్సవం సందర్భంగా ఎద్దుల బల ప్రదర్శన నిర్వహించారు. గెలచిన ఎద్దుల యాజమానులకు బహుమతులు ప్రధానం చేశారు.

ప్రతి అర్జీదారుడు సంతృప్తి చెందాలి

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో సమస్య తెలిపిన ప్రతి అర్జీదారుడు సంతృప్తి చెందేలా సమస్యలను పరిష్కరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ అధికారులను ఆదేశించారు. అదనపు కమిషనర్ ఆర్జీవి కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

విశాలాంధ్ర కర్నూలు/నంద్యాల
www.visalaandra.com
కర్నూలు, మంగళవారం 16, సెప్టెంబర్ 2025

నిండుకుండలా ప్రవహిస్తున్న ఎల్లెల్సీ కాలువ

విశాలాంధ్ర-హొళగుంద: హొళగుంద పక్కనే ప్రవహించే తుంగభద్రఎల్ ఎల్లెల్సీ దిగువ కాలువ నిండుకుండలా ప్రవహిస్తుంది. ప్రతి ఏడు ఆగస్టు, సెప్టెంబర్ మా వర్షాలు కురవక ఆయకట్టు రైతులు నీటి కోసం ఘర్షణలకు దిగేవారు. వరి వంటకు నీరు దొరకదంటూ వంతులు తమదేనంటు కొట్లాటకు దిగి స్టేషన్ వరకు పంచాయతీ వచ్చేవి అయితే ఈ ఏడు వర్షాలు మే నెల నుంచి సమృద్ధిగా కురవడంతో ఆయకట్టు రైతులకు నీటి సమస్య తప్పింది. వర్షాలు సమృద్ధిగా కురవడంతో దిగువ కాలువతో పాటు వేదావతి నది వరద నీటితో పొంగి ప్రవహిస్తుంది. తుంగభద్ర డ్యాంపై భాగంలో భారీ వర్షానికి డ్యాంలో ఇన్ఫ్లోభారీ స్థాయిలో వచ్చి చేరుతున్నాయి. లక్షలాది క్యూసెక్కు నీటిని డ్యామ్ గేట్లు నియతి తుంగభద్ర బోర్డు సెక్రెటరీ ఓఆర్కె రెడ్డి తుంగభద్రా నదికి నీటిని విడుదల చేశారు. బోరు బావుల్లో వర్షపు నీటి వల్ల భూగర్భజల మట్టం పెరిగిందని జలవనుల శాఖ అధికారులు సోమవారం తెలిపారు. వరి పంటకు వర్షం నీరు ఆక్సిజన్‌లా పని చేస్తుందని, వర్షం నీటితో వరి పంటలు కళకళలాడుతున్నాయని ఆయకట్టు రైతులు అన్నారు. పత్తికి మార్కెట్లో మంచి మద్దతు ధర ఉన్నప్పటికీ అధిక వర్షానికి అధిక తేమ ఎక్కువై పత్తి పంట ఎండిపోవడంతో లక్షలాది రూపాయలు నష్టపోతున్నామని రైతులు వాపోయారు. ఎంతో ఆశతో ఉల్లి పంట పండిస్తే మద్దతు ధర లేక అప్పుల పాలయ్యామని ఉద్యానవన రైతులు తెలిపారు. ఎల్లెల్సీ నీరు సమృద్ధిగా ప్రవహించడంతో సాగు, త్రాగునీటికి ఇబ్బంది లేకుండా పోయింది. రబి పంటకు తుంగభద్ర బోర్డు అధికారులు, ప్రజా ప్రతినిధులు సాగునీరు విడుదల చేయాలని ఆయకట్టు రైతులు, తుంగభద్ర రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు.

యూరియా కొరత తీర్చలేని ప్రభుత్వం గద్దె దిగాలి

విశాలాంధ్ర - ఆదోని రూరల్: కనీసం రైతులకు అవసరమయ్యే యూరియా కొరత తీర్చలేని ప్రభుత్వం గద్దె దిగాల్సిందే అంటూ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి రమేష్ యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు కాంగ్రెస్ నాయకులు ఆందోళన చేపట్టారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సకాలంలో యూరియా అందించడంలో ఘోరంగా విఫలమైందన్నారు. గత ఏడాది 39.5 లక్షలు మెట్రిక్ టన్నుల ఎరువుల వినియోగించుకోవడం జరిగిందని, ఈ ఏడాది కేవలం 32 లక్షలు మీటర్లు ఎరువులు మాత్రమే సరిపోతాయని రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి నివేదికలు పంపడం వెనక దాగి ఉన్న అంతర్యం ఏమిటి అని ప్రశ్నించారు. గత ఏడాదితో పోలిస్తే ఏడు లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు కొరత ఉందన్నారు. కూటమి ప్రభుత్వం రైతులకు అండగా ఉంటామని కల్లబొల్లి మాటలు చెప్పి గద్దెకెక్కడం ఎంతవరకు సమంజసం అన్నారు. అనంతరం ఎమ్మిగ నూరు ఇన్చార్జి ఖాసీమ్ వాలి మాట్లాడుతూ అధికార యంత్రాంగం రాష్ట్ర రైతుల పట్ల నిర్లక్ష్యం చేయడంతో భారీగా ఎరువుల కొరత ఏర్పడింది అన్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో ప్రైవేట్ వ్యాపారస్తుల దందా పిచ్చి మీరి పోయిందని, బడా ప్రైవేట్ కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తుందని విమర్శించారు. ఉల్లి రైతులు మద్దతు ధర లేక లబోదిబోమంటూ ఆందోళన గురవుతున్న ప్రభుత్వాలకు చీమకుట్టినట్టు లేదని విమర్శించారు. తక్షణమే రైతులకు అవసరమైన ఎరువులను అందుబాటులో ఉంచాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు సాయినాథ్, యోజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతిరావు, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు వీరేష్ యాదవ్, యువజన కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు దేవిశెట్టి వీరేష్, ఎన్ఎస్యుఐ రాష్ట్ర నాయకులు శ్రీనిత్, కాంగ్రెస్ సీనియర్ మాణిక్యరాజు, గుజరి నూర్, ఫరూక్ అహ్మద్, రామన్న యాదవ్, నిసార్ అహ్మద్ పాల్గొన్నారు.

ఘనంగా ఇంజనీర్స్ డే

విశాలాంధ్ర - బనగానపల్లె: పట్టణంలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకొని ఇంజనీర్స్ డేను ఘనంగా నిర్వహించారు. సోమవారం పట్టణంలోని తాపీ మేస్త్రీల సంఘం ఆధ్వర్యంలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకొని విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. తాపీ మేస్త్రీల సంఘం గౌరవ అధ్యక్షులు, సివిల్ ఇంజనీరు జి.మగ్బుల్ హుస్సేన్ ఆధ్వర్యంలో తాపీ మేస్త్రీల సంఘం ఇంజనీర్స్ డేను కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. అనంతరం ఇంజనీర్ జి.మగ్బుల్ హుస్సేన్ ను సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో జి.మగ్బుల్ హుస్సేన్ మాట్లాడుతూ మోక్షం గుండం విశ్వేశ్వరయ్య దేశానికి చేసిన సేవలు అమోఘం అన్నారు. ప్రతి ఇంజనీరు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిమెంట్ డీలర్ మహబూబ్ వలి, సివిల్ ఇంజనీర్ నయిమ్, ఎంఎస్ లైఫ్ స్టీల్ సేల్స్ ఆఫీసర్ రవి, తాపీ మేస్త్రీల సంఘం నాయకులు గౌండ బాబు, గౌండ సుబ్బయ్య, మహబూబ్ బాష, షేక్షావలి, రజాక్, అబ్దుల్ హమీద్, కార్పెంటర్ షబ్బీర్, మహమ్మద్ రఫీ, సాదిక్, సతీష్, జిలాని పాల్గొన్నారు.

నా కుటుంబానికి న్యాయం చేయాలి

విశాలాంధ్ర - నందికొట్కూరు: తన కుటుంబానికి న్యాయం చేయాలని ప్రజాబంధు పార్టీ నాయకులు పల్లె నాగరాజు, ప్రజాసంఘాలు, కుల సంఘాల ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని స్థానిక అంబేద్కర్ సర్కిల్ నందు నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి సిపిఐ మహిళ నాయకురాలు రజితమ్మ, ఎమ్మార్పీఎస్ నియోజవర్గ అధ్యక్షులు కోట ప్రభాకర్, వివిధ ప్రజా సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మారుతి నగర్‌లో ఉన్నట పల్లె నాగరాజు ఇంటిని కొందరు దుండగులు రేకులతో సహా కూల్చి వేశారని, వారిని వెంటనే అరెస్టు చేయాలన్నారు. వారికి తొత్తుగా ఉన్న అర్బన్ సీఐ ప్రవీణ్ కుమార్ రెడ్డిని, తహసీల్దార్ శ్రీనివాసులును వెంటనే సస్పెండ్ చేయాలన్నారు. ప్రస్తుతం ఇప్పుడు శాంతియుతంగా చేస్తున్నామని, ప్రభుత్వం స్పందించకుంటే రోజువారి నిరసనలతో ఉధృతంగా కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రజాసంఘాల నాయకులు, కుల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పశువుల్లో వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - కోవెలకుంట్ల: పాడి పశువుల్లో వచ్చే గాలి కుంటు వ్యాధి నివారణకు టీకా కార్యక్రమం చేపట్టినట్లు పశు సంవర్ధక శాఖ మండల పశు వైద్యాధికారి నవీన్ తెలిపారు. సోమవారం స్థానిక తాసిల్దార్ కార్యాలయంలో ఎంపీడీవో వరప్రసాద్, తహసీల్దార్ పవన్ కుమార్ రెడ్డి చేతుల మీదుగా జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకం వాల్ పోస్టర్లు విడుదల చేశారు. ఈ పథకం కింద ఈనెల 15వ తేదీ నుండి అక్టోబర్ 15వ తేదీ వరకు పశువుల్లో వచ్చే గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేయడం జరుగుతుందని పాడి, పశువులు ఉన్న రైతులు ప్రతి ఒక్కరు టీకాలు వేయించుకోవాలని వారు సూచించారు. పశువుల్లో వచ్చే గాలికుంటు వ్యాధి లక్షణాలు, గాలికుంటు వ్యాధి వలన కలిగే నష్టాలు, పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేయించడం వలన కలిగే లాభాలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పశువైద్యాధికారి నవీన్, ఆర్ డబ్ల్యూఎస్ ఏఈ సాయికుమార్, డిప్యూటీ డిఇ. వెంకట్రామిరెడ్డి, ఉపాధి హామీ ఏపీ వో శ్రీకళ, ఐసీడిస్ సూపర్ వైజర్ సుగుణ తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు జిల్లాకు దామోదరం సంజీవయ్య నామకరణం చేయాలి

విశాలాంధ్ర - నందికొట్కూరు: ఆంధ్ర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వర్యులు అత్యంత నిజాయతీ పరుడు, నిస్వార్థ పరుడు ప్రజల మన్ననలు పొందిన ఏకైక దళిత ముఖ్యమంత్రి, గొప్ప సామాజిక సంస్కరణ కర్త, బహుజనుల ఎదుగుదలకు ఆర్థిక పునాదులు వేసిన గొప్ప రాజనీతిజ్ఞుడు మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య పేరును కర్నూలు జిల్లాకు నామకరణం చేయాలని జిల్లా సాధన సమితి కోఆర్డినేటర్ నాగేష్ అన్నారు. సోమవారం స్థానిక పటేల్ సెంటర్లో ప్రజల నుండి, ప్రజా అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రజల నుండి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి సంతకాల సేకరణ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో దామోదరం సంజీవయ్య జిల్లా సాధన సమితి గౌరవ సలహాదారులు రాజు, గౌరవ అధ్యక్షులు వేల్పుల సుంకన్న ,నందికొట్కూరు కాంగ్రెస్ ఇన్చార్జి తేనె నాగరాజు కన్వీనర్లు జైపాల్, భాస్కర్, బి.మనోహర్, ప్రధాన కార్యదర్శి అంకన్న,కార్యదర్శి సి.మోహన్ దాసు, అల్లప్ప, శివ, యేసేపు, వనముల నాగన్న, శ్రీను,పుల్లన్న,తదితరులు పాల్గొన్నారు.

యూరియా పంపిణీ చేసిన టీడీపీ నాయకులు

విశాలాంధ్ర - నందవరం: రైతులకు సకాలంలో యూరియాను అందించే ఏకైక ప్రభుత్వం టిడిపి కూటమి ప్రభుత్వం అని టిడిపి సీనియర్ నాయకులు రైస్ మిల్ నారాయణరెడ్డి అన్నారు. సోమ వారం మండలంలోని హాలహర్విలో రైతులు యూరియాను పంపిణీ అందించారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యే డాక్టర్ బివి జయ నాగేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు గ్రామంలో రైతులకు యూరియా సమస్య రాకుండా ఎప్పటికప్పుడు యూరియాను కూటమి ప్రభుత్వం అందిస్తుందన్నారు. రైతుల పక్షపాతి అయినందుకే సీఎం చంద్రబాబు అన్నదాత సుఖీభవ కింద ఒక్కో రైతుకు మొదటి విడతగా రూ.7వేలు అందించడం జరిగిందన్నారు. మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని కోరుకునే వ్యక్తి సీఎం చంద్రబాబు అని, అందుకోసమే మహిళలకు ఉచిత ఫ్రీ బస్సును అందించారన్నారు. ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వర రెడ్డి చొరవతోనే సరైన సమయానికి దేశాయి చెరువుకు సాగునీరు అందించామని, సాగునీరు అందడంతోనే రైతులు వరి పంటలు వేసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు ఎర్రన్న, తదితరులు పాల్గొన్నారు.

తెరవెనుక రాజకీయాలు నమ్మొద్దు

విశాలాంధ్ర - ఆలూరు : ఆలూరు మండలం మణేకుర్తి గ్రామంలో ఈ నెల 10న కురువల ఆరాధ్య దైవం శ్రీ భక్త కనకదాసు విగ్రహం పగల కొట్టిన వారిని కఠినంగా శిక్షించాలి ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి అన్నారు. సోమవారం విగ్రహాన్ని పరిశీలించి అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మణేకుర్తి గ్రామంలో శ్రీ భక్తి కనకదాసు విగ్రహం పగల కొట్టడం చాలా నీచమైన పని అన్నారు. ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో అనవసరంగా గొడవలు సృష్టించడం మంచి పద్ధతి కాదని చెప్పారు. ఏదైనా సమస్య ఉంటే కూర్చొని మాట్లాడాలి తప్ప, ఇలా విగ్రహం పగలకొట్టడం మంచి పద్ధతి కాదన్నారు. గ్రామాల్లో ఎవరు లేనిపోని అపోహాలు నమ్మి గొడ వలు చేయొద్దన్నారు. విగ్రహం పగలకొట్టిన నిందుతు లను గుర్తించి వారిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. తెర్నేకల్లు సురేందర్ రెడ్డి, కురువ సంఘం జిల్లా అధ్య క్షుడు గడ్డం రామకృష్ణ, సర్పంచ్ కొల్లమ్మ పాల్గొన్నారు.

క్రీడా రంగంలో పీఈటీ పుల్లయ్యకి సేవ అవార్డు

విశాలాంధ్ర - ఆత్మకూరు టౌన్: జిల్లా స్థానిక మదర్ సర్వీస్ సొసైటీ సంస్థ ఆధ్వర్యంలో సినీనటి రజిత షాండే చేతుల మీదుగా క్రీడారంగ ప్రతిభ పురస్కర అవార్డు పీఈటీ పుల్లయ్య అందుకున్నారు. జిల్లా స్థానిక అంతర్జాతీయ గుర్తింపు పొందిన సంస్థ మదర్ సొసైటీ సంస్థ వ్యవస్థాపకుడు మల్లాది ప్రసాద్ మాట్లాడుతూ అక్కినేని నాగేశ్వరావు కళా కేంద్రం విజయవాడలో జరిగిన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, ఒరిస, తమిళనాడు, ఢిల్లీ, రాష్ట్రాల నుండి వివిధ సేవా కార్య క్రమాల్లో చేసిన వారికి అంతర్జాతీయ గుర్తింపు పొందిన మదర్ సర్వీస్ సొసైటీ సంస్థ వ్యవస్థాపకుడు మల్లాది ప్రసాద్ క్రీడా సేవా రంగంలో నంద్యాల జిల్లా ప్రవేట్ పీఈటీ పుల్లయ్య క్రీడా సేవ రంగంలో క్రీడల పట్ల ఆసక్తితో వివిధ టోర్న మెంట్లోకు క్రీడాకారులకు సేవలు అందించడంతో మదర్ సర్వీస్ సొసైటీ సంస్థ గుర్తించి గౌరవప్రదంతో క్రీడా సేవారంగం ప్రతిభ పురస్కర అవార్డు సినీ హీరో యిన్ రజిత షాండే, సినీ నటుడు పృథ్విరాజ్ చేతులు మీదుగా అరుదైన గౌరవంతో శాలువా పూలమాల జ్ఞాపికలతో క్రీడా సేవారంగం ప్రతిభ పురస్కర అవార్డు అంద జేయడం జరిగిందని మదర్ సర్వీస్ సొసైటీ సంస్థ వ్యవస్థాపకుడు మల్లాది ప్రసాద్ తెలిపారు.

పంట కోత ప్రయోగాలపై శిక్షణ

విశాలాంధ్ర- చిప్పగిరి: ఖరీఫ్ సీజన్ లో రైతులు సాగు చేసిన పంటలపై పంట కోత ప్రయోగాలపై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. సోమవారం స్థానిక రైతుసేవ కేంద్రం నందు మండల వ్యవసాయ అధికారి శ్రీరామ్ ప్రవీణ్ ఆధ్వర్యంలో సమావేశంలో నిర్వహించారు. ఈ సమావేశమునకు ముఖ్య అతిథులుగా ఆలూరు డివిజన్ వ్యవసాయ అధికారి చెంగల్ రాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలలో రైతులు సాగుచేసిన పంటలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ రైతులకు సలహాలు సూచనలు ఇవ్వాల్సిన బాధ్యత సచివాలయ వ్యవసాయ అధికారులపై ఉందన్నారు. గ్రామాలలో రైతులకు అందుబాటులో ఉంటూ రైతుల సందేహాలకు సమాధానాలు ఇవ్వాలన్నారు. ముఖ్యముగా రైతులు సాగు చేసిన పంటలు పంటకోట ప్రయోగాలపై సలహాలు శిక్షణ కార్యక్రమంలో తెలియజేశారు. రాండమై జేషన్ విధానం, పంట కోత ప్రయోగాల ప్రాముఖ్యతను క్లుప్తంగా వివరించారు. కార్యక్రమంలో ఏ ఎస్ ఓ అనిల్, మండల వ్యవసాయ విస్తరణ అధికారిని ఉమాదేవి, సచివాలయ సిసిఈ లు తదితరులు పాల్గొన్నారు.

బంగారు, సిల్వర్ మెడల్ సాధించిన అక్కాచెల్లెళ్లు

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ: అంతర్జాతీయ తైక్వాండో పోటీలలో ఆళ్లగడ్డ అరుణోదయ యుపి స్కూల్ విద్యార్థినులు బంగారు, సిల్వర్ పతకము సాధించారు. వీరిద్దరూ అక్కా చెల్లెలు కావడం విశేషం. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని అరుణోదయ యుపి స్కూల్ కరస్పాండెంట్, అపుస్మ ఆళ్లగడ్డ నియోజకవర్గం అధ్యక్షులు అమీర్ బాషా మరియు ఆళ్లగడ్డ మండలం ప్రభుత్వ ఖాజీ షేక్ మహమ్మద్ జాఫర్ సాదిక్ మాట్లాడుతూ ఫస్ట్ ఏసిఎన్ ఓపెన్ ఇంటర్నేషనల్ తైక్వాండో ఛాంపియన్ 2025 పోటీలు ఈనెల 12 నుండి 14వ తేదీ వరకు తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాదులో గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో నిర్వహించారన్నారు. ఈ పోటీలలో ఆళ్లగడ్డ పట్టణంలోని అరుణోదయ యుపి స్కూల్ ఆరవ తరగతి విద్యార్థి పటాన్ అయినయా పుంసే విభాగం వ్యక్తిగత విభాగము నందు బంగారు పతకం మరియు కుర్గిఫైట్ అండర్ 35 కేజీ విభాగంలో బ్రాంచ్ మెడల్ సాధించిందన్నారు. అలాగే నాలుగవ తరగతి పటాన్ అయినయా పుంసే విభాగంలో వ్యక్తిగత విభాగం లో సిల్వర్ మెడల్ సాధించిందన్నారు. ఈ ఇద్దరు బాలికలు తమ వ్యక్తిగత ప్రతిభ కనబరిచి అంతర్జాతీయ పోటీలలో పథకాలు సాధించడం ప్రభుత్వం ఆళ్లగడ్డకే గర్వకారణమన్నారు. ఆళ్లగడ్డ చదువుల గడ్డతోపాటు క్రీడలగడ్డకు నిలయమని చాటి చెప్పడం చాలా సంతోషదాయకం స్ఫూర్తిదాయకన్నారు. ఈ కార్యక్రమంలో ఇమామ్ హుస్సేన్ పాల్గొన్నారు.

మహిళల సాధికారత దిశగా ఈఎస్‌డీపీ శిక్షణా కార్యక్రమం

విశాలాంధ్ర - జూపాడుబంగ్లా: మహిళల కోసం ఇంట్రప్రెనేర్షిప్ అండ్ స్కిల్ డెవలప్ మెంట్, ప్రోగ్రామ్ శిక్షణా కార్యక్రమంను సోమవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ మొట్టి బాలయ్య, ఎంపీటీసీ వెంకటమ్మ హాజరై శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడం, వ్యాపార నైపుణ్యాలు నేర్పించడం, ఆర్థిక స్వావలంబనకు దారితీయడం లక్ష్యంగా ఈ శిక్షణ కొనసాగుతుందని వారన్నారు. మండలంలోని మహిళలకు 25 మందికి ఒక నెల రోజులపాటు ఈ శిక్షణ కేంద్రం ఉంటుందని వారన్నారు. రోజు రెండు గంటలపాటు శిక్షణ నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. మహిళలకు ఈ ట్రైనింగ్ లో పచ్చల తయారీ గురించి శిక్షణ ఇవ్వడం జరుగుతుందని వారన్నారు. ఇంటి దగ్గర ఉన్న ప్రతి మహిళ వారి వ్యక్తిగతంగా నిలవడానికి వారి భవిష్యత్తులో మార్గదర్శకాలకు ఒక మార్గదర్శక కావాలని వారు ఉన్నత స్థాయిలో వ్యాపారవేత్తలుగాను ఎదగడానికి ఇది ఒక మంచి అవకాశం అని వారు తెలిపారు.ప్రస్తుత కాలంలో మహిళలు ఉద్యోగాలకే పరిమితం కాకుండా వ్యాపార రంగంలోనూ అడుగులు వేయాలని వారు తెలిపారు. ఈ శిక్షణ ద్వారా మహిళలు తమ ప్రతిభను వినియోగించి స్వయం ఉపాధి దారులుగా మారాలని వారు పేర్కొన్నారు. గ్రామీణ మహిళలు ఆర్థికంగా బలపడితే కుటుంబంతో పాటు సమాజం కూడా అభివృద్ధి సాధిస్తుందని వారన్నారు. ఈ కార్యక్రమంలో సెంటర్ ఇన్చార్జి గోపాల్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

మహిళలల్లో నిరక్షరాస్యతను తగ్గించడమే ఉల్లాస అక్షరాంధ్ర లక్ష్యం

విశాలాంధ్ర - నందవరం: గ్రామీణ ప్రాంతాల్లోని మహిళల్లో నిరక్షరాస్యతను తగ్గించి అక్షరాస్యతను పెంచడమే ఉల్లాస్ అక్షరాంధ్ర ముఖ్య లక్ష్యమని జిల్లా వయోజన విద్యా అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ బి. ప్రతాప్, డిప్యూటీ ఎంపిడిఓ సందీప్ లు అన్నారు. సోమవారం శ్రీశక్తి భవనంలో డిఆర్డిఏ ఏపీఎం రాఘవేంద్ర ఆధ్వర్యంలో వాలంటరీ టీచర్స్ కుశిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో మొత్తం 11541 మంది మహిళలు నిరక్షరాశులగా ఉన్నారని, ఈ సంవత్సరం 3660 మందిని టార్గెట్ గా తీసుకొని, అక్షరాసులుగా చేయడమే ముఖ్య లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఒక వాలెంటరీ టీచర్స్‌కి పది మంది నిరక్షారాస్యులను ఇవ్వడం జరిగిందని, ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యత గురించి వివరించారు. మండలంలో ఉల్లాస అక్షరాంధ్ర ఒక యజ్ఞంలో జరగాలని, ప్రతి రోజు సాయంత్రం ఒక గంట పాటు చదువు చెప్పాలన్నారు. చదువు నేర్చుకున్న నిరక్షరాశుల మహిళలకు మార్చిలో ఎన్ఐఓఎస్ పరీక్ష ఉంటుందని, ఆ పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికెట్ ఇస్తామన్నారు. నిరక్షరాశులయిన స్త్రీలకు చదువు నేర్పించాలని, ఏ ఇంటిలో స్త్రీ చదువుకుంటుందో, ఆ ఇల్లు సిరి సంపదలతో, నాగరికతతో ఉంటుందని, పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకే పంపించాలన్నారు. సూపర్వైజర్ నేమిలయ్య, డిఆర్డిఏ సిబ్బంది పాల్గొన్నారు.

పాన్ ఇండియా ఐకానిక్ అవార్డు పొందిన తలారి హర్ష వర్ధన్

విశాలాంధ్ర ఆదోని రూరల్: ఆదోని మండలం పెద్దహరివనం గ్రామానికి చెందిన తలారి హర్ష వర్ధన్ విద్యా రంగంలో చేస్తున్న విశిష్ట సేవలకు ప్రతిష్టాత్మక పాన్ ఇండియా ఐకానిక్ టీచర్ అవార్డు -2025 లభించడం ఆదోనికి గర్వకారణం. హైదరాబాద్‌లోని స్పెక్ట్రాప్పీ ఫిల్లింగ్ ది లెర్నింగ్ గ్యాప్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో సబ్జెక్టు మేటర్ ఎక్స్పర్ట్ (ఎస్ఎంఈ)గా పనిచేస్తూ, విద్యార్థులలో నేర్చుకునే లోటుపాట్లను పూరించేందుకు వినూత్నమైన పద్ధతులు అమలు చేస్తున్నందుకు తలారి హర్ష వర్ధన్ అవార్డు లభించడం జరిగింది. తండ్రి తలారి నాగేంద్రప్ప (వీఆర్వో), తల్లి తలారి జనకి కుటుంబం నుంచి ఎల్లప్పుడూ ప్రోత్సాహం లభించిందని తలారి హర్షవర్ధన్ తెలిపారు. ప్రత్యేకంగా పెద్ద హరివాణం పాఠశాల ఉపాధ్యాయులు ఇచ్చిన స్ఫూర్తి, అన్నయ్య కుమార స్వామి అందించిన సహకారం తన విజయానికి మూల కారణమని హర్షవర్ధన్ అన్నారు. హైదరాబాద్ కేంద్రంగా స్పెక్ట్రాప్పీ లెర్నింగ్ సెంటర్ ద్వారా అనేకమంది విద్యార్థులకు నాణ్యమైన బోధన అందిస్తూ, భవిష్యత్ తరాలకు బలమైన విద్యా బాటలు వేయడం తన లక్ష్యమన్నారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు, ఉపాధ్యాయులు పాల్గొని హర్షవర్ధన్‌ను అభినందించారు.

వొకేషనల్ కళాశాలలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి వేడుకలు

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్ : స్థానిక బీక్యాంప్ ప్రభుత్వ వొకేషనల్ జూనియర్ కళాశాలలో సోమవారం ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.నాగస్వామి నాయక్ ఆధ్వర్యంలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్, లెక్చరర్స్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్ర పటానికి పూల మాల వేసి ఘనమైన నివాళులర్పించారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య గొప్ప ఇంజనీరు, పండితుడు, రాజనీతిజ్ఞుడు అని, 1955 లో ఆయనకు భారత దేశపు అత్యున్నత పౌర పురస్కారమైన భారతరత్న లభించిందని, నేటి యువ ఇంజినీర్స్‌కు అయన జీవితం ఆదర్శం అని ప్రిన్సి పాల్ అన్నారు. మైసూర్‌లోని ఆనకట్ట కృష్ణ రాజ సాగర్‌కు ఛీఫ్ ఇంజనీర్ గా పని చేశాడని, హైదరాబాదు నగరాన్ని మూసీ నది వరదల నుంచి రక్షించడానికి పథకాలను రూపొందించాడని, సాగు నీరు మరియు తాగు నీరు ప్రాజెక్టుల నిర్మాణం లో విశేషమైన కృషి చేసిన సందర్భంగా ఆయన జన్మదినమైన సెప్టెంబర్ 15ను ఇంజినీర్స్ డేగా నిర్వహించుకుంటారని ప్రిన్సిపాల్ అన్నారు. కార్యక్రమంలో కళాశాల లెక్చరర్స్ ప్రసన్న కుమార్, రామకృష్ణ, విజయశేఖర్, మల్లికార్జున, లక్ష్మి, శ్రీధర్, లావణ్య విద్యార్థులు పాల్గొన్నారు.

మంచినీటి సమస్యను పరిష్కరించండి.. సార్

విశాలాంధ్ర -చిప్పగిరి: మంచినీటి సమస్యను పరిష్కరించాలంటూ ఎస్సీ కాలనీ వాసులు మండల అభివృద్ధి అధికారికి వినత పత్రం ద్వారా కోరారు. సోమవారం చిప్పగిరి గ్రామంలోని ఎస్సీ కాలనీ వాసులకు గత పది రోజులుగా కాజీపురం రిజర్వాయర్ నుండి తాగునీరు రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, విరుపాక్షి నివాసం వద్ద ఉన్న మినీ మంచి నీటి ట్యాంక్ వద్ద నుండి పోస్ట్ ఆఫీస్ మధ్యలో మురుగునీరు రోడ్డుపైనే నిలువ ఉండడంతో దుర్వాసనకు దోమల సంతతి పెరిగి దోమకాటులకు అనారోగ్య పాలవుతున్నామని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. మంచినీటి సమస్య తీవ్ర రూపం దాల్చడంతో కాలనీవాసులు మండల అభివృద్ధి అధికారికి వినత పత్రం ద్వారా తెలినపారు. మల్లికార్జున, వంద్రప్ప, శివన్న, మల్లయ్య, నాగార్జున లక్ష్మన్న, మల్లక్క, శివ పాల్గొన్నారు.

భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తాం

విశాలాంధ్ర-హొళగుంద: ఎల్లార్తి హజరత్ షేక్షావలి, షాషావలి 363వ ఉరుసు సందర్భంగా గ్రామంలో ఎర్రమట్టి వేశామని సర్పంచ్ కురువ చాముండేశ్వరి సోమవారంతెలిపారు. స్థానిక ఊరు వాకిలి దర్గా నుండి గిరి మల్లప్ప ఇంటి వరకు ఎర్ర మట్టి వేసి చదును చేశామని అన్నారు. భక్తులకు ఇంటి ముంగిట మంచినీటి సదుపాయాన్ని కల్పిస్తామని ట్యాంకర్ల ద్వారా మంచి నీరు సరఫరా చేయడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు. కొత్తగా వీధి దీపాలు ఏర్పాటు చేశామని భక్తులకు అంటురోగాలు రాకుండా పారిశుధ్యం ప్రతిరోజు తొలగిస్తామని అన్నారు. వైసీపీ జిల్లా ఎస్కె గిరి ల్గొన్నారు.

లారీ అసోసియేషన్ కార్యాలయం ప్రారంభం

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : పట్టణంలో లారీ అసోసియేషన్ నూతన కార్యాలయాన్ని టిడిపి సీనియర్ నాయకులు భార్గవ్ రామ్, యువ నాయకులు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డిలు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం లారీ యజమానులతో సమావేశమై వారి సమస్యలు తెలుసుకున్నారు. లారీ ఓనర్ల సమస్యలు ఏవైనా ఉంటే తమ దృష్టికి తీసుకుని వస్తే వాటిని కచ్చితంగా పరిస్కరిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాధవరెడ్డి, లారీ ఓనర్లు పాల్గొన్నారు.

నివారణ టీకాలను సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర - చాగలమర్రి : పాడి రైతులు పశువులకు గాలి కుంటువ్యాధి నివారణ టీకా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు వరప్రసాద్ అన్నారు. సోమవారం చాగలమర్రి పట్టణంలో జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా మండల పశుసంవర్ధశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన గాలికుంటు వ్యాధి టీకాల కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు ఒక్కటే మార్గమన్నారు. ఈవ్యాధి నివారణకు సంబంధించి పశువులకు టీకాలు వేయడం ఎంతో ఉపయోగమన్నారు. వ్యాధిసోకిన పాడి పశువుల్లో తగ్గేపాల ఉత్పత్తిని శాశ్వతంగా నివారించవచ్చన్నారు. ఈ టీకా కార్యక్రమాన్ని అక్టోబర్ 15 వరకు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో పశు వైద్యసిబ్బంది మహబూబ్ బాష, నవీన్ తదితరులు పాల్గొన్నారు.